# మీరు చదివారా?

## – కృష్ణవేణి





(నెలనెలా ఓ పుస్తకం – సమగ్రపరిచయం)

## *Heartburn*



నోరా ఇఫ్రోన్ (మే 19, 1941 – జూన్ 26, 2012) అమెరికన్ జర్నలిస్ట్, రచయిత్రి, సినీ నిర్మాత. న్యూయార్క్ పట్టణంలో యూదుల కుటుంబంలో జన్మించారు. రొమాంటిక్ కామెడీ సినిమాలు ఆమెకు పేరు తెచ్చి పెట్టాయి. 'సిల్క్‌వుడ్' (1983) 'వెన్ హారీ మెట్ సేలీ' (1989) 'స్లీప్‌లెస్ ఇన్ సియాటిల్' (1993) సినిమాలకని 'ఎకేడెమీ అవార్డ్ ఫర్ బెస్ట్ రైటింగ్' కోసం నామినేట్ చేయబడ్డారు. రెండవ సినిమాకి 'బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే '(BAFTA) అవార్డ్ గెలుచుకున్నారు. 1998లో– ఇఫ్రోన్, 'యు హావ్ గాట్ మెయిల్' ని విడుదల చేశారు. యీ సినిమాకి దర్శకురాలూ స్క్రిప్ట్ రైటరూ కూడా ఆమే. ఇఫ్రోన్ ఆఖరి సినిమా జూలియా & జూలియా (2009) . 2013లో 'లక్కీ గై' నాటకానికని 'పోస్థ్యుమస్ టోనీ అవార్డ్ నామినేషన్ ఫర్ ద బెస్ట్ ప్లే" పొందారు. స్నేహితుడైన వూడీ అలెన్ సినిమాలు 'ఇన్ క్రైమ్స్ అండ్ మిస్డీమెనర్స్(1989) మరియు 'హస్బండ్స్ అండ్ వైవ్స్' (1992) లో చిన్న పాత్రలు పోషించారు.


తన రొమాంటిక్ కామెడీలు అంత సీరియస్గా తీసుకోనవసరం లేని కల్పిత కథలు మాత్రమే అన్న రచయిత్రి స్వీయకథే 'హర్‌ట్‌బర్న్.' 1979లో వాషింగ్టన్ పోస్ట్ ఇన్వెస్టిగేటివ్ రిపోర్టర్ అయిన కార్ల్ బర్న్‌స్టైన్‌తో జరిగిన ఇఫ్రోన్ రెండవ వివాహంలో జేకబ్ పుట్టాడు. రెండో కొడుకైన కుమారుడైన మాక్స్‌ను గర్భంలో మోస్తున్నప్పుడు, ఆ భార్యాభర్తలకిద్దరికీ స్నేహితురాలూ, బ్రిటిష్ జర్నలిస్టూ అయిన వివాహిత స్త్రీ 'మార్గరెట్ జే' తో సంబంధం పెట్టుకుంటాడు బర్న్‌స్టైన్. ఇఫ్రోన్ జీవితకాలపు ఆ దశ ఆధారంగా వచ్చిన యీ నవలను నోఫ్ 1983 లో పబ్లిష్ చేసింది. దీని పైన, ఇదే పేరుతో 1986లో వచ్చిన సినిమాలో– జాక్ నికల్సన్, మెరిల్ స్ట్రీప్ నటించారు.

ఇఫ్రోన్ 2012లో జూన్ 26న, న్యుమోనియా వల్ల మరణించారు.

★★

హర్ట్ బర్న్ నవలిక 38 ఏళ్ళ రేచెల్ సామ్‌స్టేగ్ జీవితపు ఆరువారాలమీద ఆధారపడినది. ఆమె వంట పుస్తకాల రచయిత్రి. రేచెల్ థెరపిస్ట్ చెప్పినట్టు 'ఆమెకి ఎంత బాధనిపించినా జోక్స్ వేస్తుంది.' మొదటి పెళ్ళి విడాకులకు దారి తీస్తుంది. మార్క్ ఫీల్‌డ్‌మాన్ వాషింటన్లో న్యూస్‌పేపర్ కాలమిస్ట్. 'మార్క్‌కు విరుద్ధంగా సాక్ష్యాలున్నప్పటికీ అతన్ని పెళ్ళి చేసుకున్నాను. పెళ్ళి కొనసాగదనీ, ప్రేమ చనిపోతుందనీ నమ్మి కూడా. ఇలా చేయడంలో మోహం మటుమాయం అవుతుందని తెలుసు. కేవలం ఒక నిరాశావాది మాత్రమే అవగల కాల్పనిక వ్యక్తినయాను.' అన్న రేచెల్‌కి మార్క్ ద్వారా కలిగిన రెండేళ్ళ

కొడుకుంటాడు.




'వెనీషియన్ బ్లైండ్స్‌తో కూడా శృంగారం జరపగల' తన భర్త, వేరే స్త్రీ ప్రేమలో పడ్డాడని రెండోసారి గర్భవతి అయిన రేచెల్‌కు తెలుస్తుంది. 'మార్కుకూ, పొడుగైన థెల్మా రైస్‌కీ సంబంధం ఉంది. ఆమె మెడ చెయ్యంత పొడుగైతే, ఆమె ముక్కు బొటనవేలంత. ఆమె కాళ్ళను చూడాలి. ఇక ఆ వికారమైన పాదాల గురించి చెప్పనవసరమే లేదు.' అన్న ఆలోచనలు వచ్చిన రేచెల్, దాని గురించి భర్తను నిలదీస్తుంది. 'నీవు సాధించే గయ్యాళివి. థెల్మా నీ కన్నా ఎన్నో రెట్లు మెరుగు' అంటూ రెబెకా మనస్సు గాయపరుస్తాడతను. కొడుక్కోసమూ, పుట్టబోయే బిడ్డకోసమూ రేచెల్‌ను విడిచిపెట్టక వారితోనే కలిసి ఉంటానంటాడు.

'వేరే ఏదైనా చోటుకి వెళ్ళి ఆలోచించుకుంటే స్పష్టత వస్తుంది.' అనుకున్న రేచెల్, కొడుకును తీసుకుని తండ్రి ఉండే న్యూయార్క్ వెళ్తుంది. అక్కడ తన పాత థెరపీ గ్రూపుని కలుసుకోడానికి వెళ్ళినప్పుడు, ఒక ముసుగు మనిషి కత్తితో బెదిరించి అందరి వద్దనున్న నగలూ, డబ్బూ తీసుకు పారిపోతాడు. కొడుకు పుట్టినప్పుడు మార్క్ తనకి బహూకరించిన ఉంగరం కూడా వాటిల్లో ఉన్నప్పుడు, 'ఇది దేనికైనా సంకేతమేమో!' అన్న సందేహం కలుగుతుందామెకు. ఆ గ్రూపులో ఇద్దరికి ఆ దొంగ ఆకర్షణీయంగా అనిపిస్తాడు.

కొన్నేళ్ళ కిందటే రేచెల్ తల్లి, అంత వయస్సులో 'మెల్ ' అనే వ్యక్తితో మెక్సికో పారిపోయి అతన్ని పెళ్ళి చేసుకునుంటుంది. "మెల్ నిజాయితీగానే తను దేవుడిననుకుంటాడు. అయితే, 'నా మొదటి భర్త చార్లీ వొకసారి అన్నట్టుగా" దేవుని గురించి మనకి తెలినదేమైనా ఉందంటే, దేవుని పేరు 'మెల్" అన్నది మాత్రం అయి ఉండదు అన్నది." అంటుంది రేచెల్.

ఆమెను ఇంటికి పిలుచుకు రావడానికి మార్క్ న్యూయార్క్ వచ్చి, తనింక థెల్మాను కలుసుకోనని మాటిచ్చిన తరువాత కొడుకుతో పాటు తిరిగి వాషింగ్టన్ వస్తుంది. 'నాకు కావల్సినదేమిటి!' అని తన్ని తానే ప్రశ్నించుకోవడం మానదు. తను చూసిన ప్రతీ మగవాడితో తనకి పెళ్ళయిందని ఊహించుకుంటుండటం వల్ల, ఆమెకి ఆత్మగౌరవం తక్కువన్న సంగతి పాఠకులకు తెలుస్తుంది. తన వివాహబంధాన్ని నిలబెట్టుకోవడం కోసం తన స్నేహితులతో తన పరిస్థితి గురించి మాట్లాడుతూ, వారితో తన వైవాహిక జీవితాన్ని పోల్చి చూసుకుంటూ, వారి సలహాలు అడుగుతుంది.

రెండో కొడుకు పుట్టిన తరువాత– తను హాస్పిటల్లో ఉన్నప్పుడు– మార్క్ థెల్మాకు నెక్లేస్ కొనిచ్చాడని తెలుసుకుంటుంది. భర్త తనకు దూరం అవడానికి కారణం, తను వంటలు చేస్తూ సమయం గడపడమే అన్న నిర్ణయానికి వస్తుంది: 'నాకు వంటంటే ప్రేమ. నేను తనను ప్రేమిస్తున్నాను అని మార్క్‌కి తెలియపరచడానికి అదే దారి అయింది.' అనుకుంటుంది.

పుస్తకమంతటా– తను ఎటువంటి స్త్రీని కానని భర్త అన్నాడో అలాంటి మనిషే అవడానికి ప్రయత్నిస్తుంది. అయితే ఆఖరికి– తనెప్పుడూ అలాగే ఉన్నాననీ, మారినది మార్కే అని అర్థం చేసుకుంటుంది. ఒక డిన్నర్ పార్టీలో తమమధ్య ఉన్న సంబంధం మరెప్పుడూ సరి అవదని సూచిస్తూ, మార్క్ మొహంమీద కేకు కొట్టి, పులుముతుంది. ఇతరులు తననుంచి ఆశించే వ్యక్తిత్వం కాకుండా, తను తనలాగే ఉండాలనుకుని అతన్ని వదిలిపెడుతుంది.

★★★

స్త్రీ పురుష సంబంధాలు, మోసం, అపరాధభావం తనపై తానే జాలి పడ్డం గురించిన పుస్తకమంతటా, రేచెల్ వంటకాల వివరాలూ, నోరు తిరగని దినుసులూ, ఆమె చేసిన టివి కుకరీ షోలూ ఉంటాయి. దుఃఖకరమైన నొప్పిని చూపే సంఘటనలను కూడా హాస్యంగా వర్ణించడం వల్ల చదవాలనిపించే నవల. 180 పేజీలు కూడా ఉండని యీ నవలిక తన రెండవ భర్త కార్ల్ బర్‌న్‌స్టీన్‌తో తను విడిపోయిన వృత్తాంతమే అని ఇఫ్రోన్ అంగీకరించారు. దీని ఆధారంగా వచ్చిన సినిమా ఇక్కడ చూసే వీలుంది:

http://m4ufree.live/watch-yyad-heartburn-1986-movie-online-free-m4ufree.html

COMMENTS